# తనదాకా వచ్చింది

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

## ౧

"వాడు ఛండాలుడు."

"అలా అనకు నాన్నా."

"ఏమన మంటావు మరి? వాడి గుణాలు తలుచుకుంటే వొళ్లు మండిపోతోంది. నాకు వాడి తాతా, తండ్రీ రాచపౌరోహిత్యం చేసినా నకదారే అనుకున్నాను. ఆస్తికోసం భ్రమపడీ, ఇంగ్లీషు చదువుచూసి వుద్యోగం చేసి వెలిగిస్తాడని ఆశపడీ, మీయమ్మ పోరడంచేత యీసంబంధానికి వప్పుకున్నాను గాని దిక్కుమాలిన యింగ్లీషు కొంప ముంచుతుం దని మొదణ్ణుంచీ—"

"ఇంగ్లీషు చదువుకున్నవారంతా యిలా అయినారా?"

"అయినారా అంటే అంతా తలో మోస్తరూనూ. నీపాపం పండమట్టి వాడిలా అయినాడు."

"................................"

"మాట్లాడవు నువ్వు; నాకు తెలుసు నీవేషా లన్నీ. దిక్కుమాలిన ఆడాళ్లు పడుచుతనంలో 'మొగుడో మొగుడో' అని పడిచస్తారు."

"................................"

"వాడలా కులభ్రష్టు అయిపోయాక యిక మొగుడంటే యేమిటి? వూరుకో మాట్లాడక."

"నువ్విలా అనవచ్చునా నాన్నా?"

"అనాలా కోసెయ్యాలా? నీగొంతు కోసేశాడు వాడు."

"ఏంకోశారు నాన్నా?"

"బుద్ధిలేని పీనుగా, యేం కోశా డంటున్నావా? ఇంతకంటే చచ్చిపోతేనే నయం."

"హరిహరీ! నేను వినలేను."

"వినలేకపోతే వూరిపెట్టుకో. నాకున్నూడా అపకీర్తి తెచ్చిపెట్టాడు, వాడిల్లు వల్లకాడుకానూ."

"తిట్టకు నాన్నా."

"ఛీ! నీమొగం యీడ్చా. ఇందాకణ్ణుంచి చూస్తాను. నక్కమోస్తరుగానే వాణ్ణి వెనకేసుకువస్తున్నావు నువ్వు. నా కడుపు చెడపుట్టేరు నువ్వూ రామిగాడూనూ."

"చివరి కలా తోచిందా?"

"తోచదూ మరీ? రామిగాడు నిన్ను పంపెయ్యమని యేడుస్తాడు. నువ్వు వాణ్ణి రమ్మని రాయమంటూ వేపేస్తున్నావు. పెద్దవేమూరివా రంటే జిల్లాకల్లా పేరు మోసిన శిష్టాచారసంపన్నులు. ఎన్ని తరాలనుంచి వస్తోందో అవిచ్ఛిన్నాగ్నిహోత్రం యీకుటుంబంలో. నాతాత ముత్తాతదగ్గిరనుంచీ అగ్నిష్టోమ మేనా చెయ్యనివాడు లేడు. నేనేనా సర్వతోముఖం తగలేసినవాణ్ణి కాని సామాన్యుణ్ణా? ఇలాంటికుటుంబంలో నువ్వూ, రామిగాడూనూ తులసివనంలో గంజాయిమొక్కల్లాగ చెడపుట్టేరు. నామర్యాద తీసేస్తున్నారు మీరిద్దరూనూ."

"అలా అంటావేం నాన్నా? మేమేం తప్పు చేశామూ? రామచంద్రం అన్నయ్య. నన్ను పంపెయ్యమని అంటున్నా నేనింకా వెడతా ననేనా అనలేదే? నీయెదటికి వస్తే బుద్ధి మారుతుం దేమో అన్న ఆశచేత వారిని వక్కమాటు రమ్మని రాయమన్నాను. ఇంతేనా నేను చేసిన అకార్యం?"

"ఇది చాలదూ? ఇంతకంటే యేం కావాలీ? ఇంక బుద్ధి మారితే మాత్రం యేంలాభమూ చెడ్డతరవాత? పొరపాటుపడ్డవాడికి ప్రాయశ్చిత్తం కాని, బుద్ధిపూర్వకంగా తగులడ్డవాడికి యిక తరణోపాయం యెక్క-

డిది? ఇంతకీ యేమయినా సరే. వాడిక నా గుమ్మంలో అడుగుపెట్టడానికి వల్లకాదు. వీరేశలింగంతో యెప్పుడు కలిశాడో అప్పుడే లేడనుకున్నాను వాడు."

"రామరామా."

"అలా అనుకుని మనస్సుకి సమాధానం చెప్పుకో."

"చెప్పుకునీ?"

"అనుభవించడమే."

"అంటే?"

"అంటే యేం వుంది? వాణ్ణిక నువ్వు తలుచుకోడానికేనా వల్లకాదు. నా యెదుట యిక వాడి ప్రాసెత్తకు."

"ఎవరో వితంతువు మళ్లీ పెళ్లాడితే ఆ పెళ్లికి వెళ్లారు. అలాంటి పెళ్లి చేసుకోలేదు; చేయించలేదు; చెయ్యలేదు. ఆ పెళ్లిలో నేనా భోజనం చెయ్యలేదు."

"చెయ్యలేదన్న మాట యేమిటి?"

"తాంబూలంపుచ్చుకుంటే పుచ్చుకున్నా నని వారే రాశారుకదూ?"

"అది నమ్మకమా? అలాంటి పని యిష్టమైనవాడికి భోజనం అడ్డా? యిక చెప్పకు. వాడు కులంచెడ్డాడు."

"తొందరపడకు నాన్నా."

"చాలుచాలు. నా యెదుట నువ్వింక యెప్పుడేనా వాడి ప్రస్తావన తెచ్చావంటే బాగా జరగదు. ఇదే చెప్పడం నీకు. మనోవృత్తిదావా పడేస్తాను చూస్తూవుండు."

"అయ్యో! నా కొంప ముంచుతావా నాన్నా?"

చంద్రమ్మ యిలా అంటూ వుండగానే అతను ధుమధుమలాడుతూ లేచిపోయాడు. ఆమె దిగ్భ్రాంతయి వుండగా రామచంద్రం వచ్చి "విచారించకు. నేను బతికివుండగా నీకు విపత్తులు రావు" అన్నాడు. కాని ఆమెకు ధైర్యం కలగలేదు. పైగా దుఃఖం పుట్టుకొస్తూగా పొంగివచ్చి యామెని గజగజలాడించివేసింది. "బుల్లన్నయ్యా! ఇంతకంటే విపత్తేమి కావాలీ? చెడకుండా ప్రయత్నం చెయ్యమంటే నాన్న యిలా అంటున్నాడు. వెళ్లడానికి సాహసించలేకపోతున్నాను నేను. అమ్మ యేడుపు భరించలేనంతగా వుంది. 'వెళ్లి అగ్నిహోత్రంలో వురుకుతావా?' అంటుం దమ్మ. ఊరకనూ లేను, వుండనూ లేనూ. కావలసినంత డబ్బు దొరుకుతోం దని సంతోషిస్తూవుండగా యీవుప్పెన యేమి టన్నయ్యా?" అని యామె చాలా విచారించింది. "ఇప్పుడు కాదు. అనరాని మాట లని నిన్ను హడలకొట్టేడు నాన్న. తరవాత చెబుతానులే. ముందు అన్నం తిను" అని రామచంద్రం చంద్రమ్మని చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లాడు.

## ౨

కృష్ణయాజులికి నలుగురు కొడుకుల వెనక యిద్దరు కూతుళ్లు. రామచంద్రం కొడుకుల్లో చిన్న; చంద్రమ్మ కూతుళ్లలో పెద్ద. పెద్దకొడుకు పెళ్లాం పోరు పడలేక వేరున్నాడు. రెండో కొడుకు అత్తవారింటికి యిల్లరికం వెళ్లాడు. మూడో కొడుకు అన్ని విధాలా తండ్రికి ఆసరా అవుతూ వుంటాడు. రామచంద్రం అంటే "అనాచారప్పీనుగు" అని తిడుతూ "వీడెప్పటికేనా కులం చెడేవాడే" అంటూ వుంటాడు యాజులు.

చంద్రమ్మకి పాతికేళ్లు వున్నాయి. ఇంకా సంతానం కలగలేదు. ఆమె భర్త చల్లా వేంకటరావు చెన్నపట్నంలో ప్లీడరీ చేస్తూ నెలకి వెయ్యిరూపాయలుదాకా సంపాదిస్తున్నాడు. భార్యాభర్త లిద్దరూ పరస్పరప్రేమతో చిలకాగోరింకల్లాగ కులుకుతూ వుంటారు.

చంద్రమ్మ చెల్లెలు సోమమ్మ పద్ధానుగేళ్ల పిల్ల. ఆమెకి యెనిమిదో యేట పెళ్లయింది. మొన్ననే రజస్వల అయింది. ఆమె భర్తకి బెంగాలునాగపూరు రైల్వేలో వుద్యోగం. ఓ మాటు—అంటే పెళ్లయిన కొత్తరికం—సంతరగచ్చిస్టేషనులో అతనొక యురేషియనుతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతూ వుండగా కాశీ వెడుతూ వున్న యాజులు చూశాడు. తరవాత వక మాటు మహేంద్రవాడ రాగా తనబంతికి రానిచ్చాడు కాడు. అది మొదలు యిద్దరికీ ద్వేషాలు ముదిరాయి. ఎవళ్లు తగ్గించా లని చూసినా లాభం లేకపోయింది.

నెల్లాళ్లకిందట చంద్రమ్మ సంకురాత్రికోసం పుట్టింటికి వచ్చింది. వెంకటరావుకూడా వచ్చాడు. కాని "పదిరోజు లట్టేపెట్టుకుని పంపిస్తా" నంటే అత్తగారి

మాట తీసెయ్యలేక సరే అని తానొక్కడూ వెళ్లిపోయాడు. చంద్రమ్మ యిక్కడ మాతృవాత్సల్యమూ, భర్తృప్రేమా పరీక్షించుకుంటోందా అన్నట్లు డోలాందోళిత చిత్తగా వుంది.

జనవరి ౨౪ వ తేదీని వీరేశలింగంపంతులు మద్రాసులో వక పెద్దప్లీడరు చిన్నకూతురికి పునర్వివాహం చేశాడు. పంతులుమీద వుండే గురుభక్తిచేతా, పిల్లతండ్రి పిలవడంచేతా, స్త్రీపునర్వివాహాచారంమీద వుండే ప్రీతిచేతా వెంకటర్రావు ఆపెళ్లికి వెళ్లి తాంబూలం పుచ్చుకు వచ్చాడు. మద్రాసుపత్రిక లన్నీ పెళ్లికి వచ్చిన ప్రముఖుల పేర్లలో వెంకటరావుపేరుగూడా చేర్చాయి. మహేంద్రవాడలో చిర్రావూరి మరిడయ్య ఆంధ్రపత్రికలో యీసంగతి చూసి యాజులుతో చెప్పాడు.

యాజులు పూర్వాచారపరులికి మొనగాడు. శాస్త్రోల్లంఘనానికైనా వప్పుకుంటాడు గాని ఆచారభంగానికి వప్పుకోడతను. ఆవూళ్లో వున్న యెనభైయిళ్ల వైదికులలోనూ పెద్దవేమూరివారికుటుంబం తలమానికంగా వుంది. ఈయాధిక్యాన్ని నిలబెట్టుకోడానికి యాజులెంత నిక్కచ్చిగానైనా మసులుకుంటూ వుంటాడు.

అతనే గాదు; భార్యా, కొడుకులూ, కూతుళ్లూ గూడా చాలా జాగ్రత్తగానే వుంటారు. కోడళ్లుమాత్రం ఆచారవిషయంలో కొంచెం గొణుగుకుంటూ వుంటారు; గాని పైకి యేమీ అనలేకా, విధిలేకా అందరితోపాటే నడుచుకోడానికి ప్రయత్నిస్తూ "యెప్పుడు పండుగులు వస్తాయా పుట్టిళ్లకి వెళ్లి యెప్పుడు సుఖపడతామా ?" అని చూస్తూవుంటారు.

ఇలాంటి కుటుంబంలో రామచంద్రం వక్కడు మాత్రం ఇంగ్లీషు చదువుకోకపోయినా సంఘసంస్కారం అంటే కొంచెం వూగిసలాడతాడు. వీరేశలింగంగారు, మేరువులాగ నిలవకపోతే సంఘం యీపాటికి కుళ్లి కంపెత్తిపోయివుండదూ ?" అంటూవుంటాడత నక్కడక్కడ తండ్రికి తెలవకుండానూ.

సరే. వెంకటరావు వితంతువివాహం చూడడానికి వెళ్లాడు. ఆసంగతి యాజులికి తెలిసింది. ఇది యాదాలాభంగా తెలిస్తే యేమానో. కాని యీసంగతి తనకంటే ముందు వూళ్లోవాళ్ల కందరికీ తెలిసిం దని అతను గ్రహించాడు. ఈ సంగతి స్వయంగా మరిడయ్య చెప్పడంలో కొంత హేళనభావం వుందనికూడా అనుకున్నాడు. దీనితో ఛెళ్లున కొరడా దెబ్బ తగిలినట్లు కాగా "యేం చెప్తావు దీని" కని నిక్కచ్చిగా వుత్తరం రాశాడు. యాజు లెంత శ్రోత్రియు డైనా, యెంత విద్వాంసు డైనా, యెంత పెద్దవా డైనా వెంకటరావు అల్లుడుకదూ? "పెళ్లికి వెళ్లినమాట వాస్తవమే. తాంబూలం పుచ్చుకుని వధూవరులని దీవించివచ్చాను. ఇందులో అబద్ధం లేదు" అని యాతడు నిర్లక్ష్యంగా జవాబు రాశాడు.

యాజులికి వొళ్లు మండుకుపోయింది. తన అల్లుడై వుండిన్నీ వితంతువివాహానికి వెళ్లడమా? కులం చెడితే వదిలేస్తాడు. అందువసందేహమూ, సంకోచమూ లేవు యాజులికి. "కృష్ణయాజులుగారి అల్లుడు వెధవముండల పెళ్లిళ్లలో తిరుగుతున్నా డంటే యాజులికి అపకీర్తి కాదూ ? అల్లుడి వుత్తరం చూసి కొంచె మేనా పస్తాయంచ లేదతను. అరికాలిమంట నెత్తికి తెచ్చుకున్నాడు "వాణ్ణి గుమ్మంలోకి రానియ్యకూడదు. వాడి మొగం చూడకూడదు. చంద్రిని యిక్కడే వుండిపోనీ" అనుకున్నా డతను. యాజులు పచ్చిగడ్డిని రాజేశాడు.

భర్త వితంతువివాహం చూడడానికి వెళ్లి నందుకు చంద్రమ్మ తహతహలాడిపోయింది. మొగుడెంత అనాచారం చేసినా చంద్రమ్మ సొంతానికి మాత్రం పుట్టింటి అలవాటుచొప్పున వుండడానికే ప్రయత్నిస్తూ వుంటుంది. భోజనంచేస్తూ వుండగా వెంకటరావు అప్పుడప్పుడు జోడుకాళ్లతో వచ్చి ఆమెను ముట్టుకుంటూనే వుంటాడు. కాని యాతనివల్ల నామె వక్క వరం పొంది వుంది: "మీయింటో వున్నప్పుడు మీరేం చేసినా సరే. మావాళ్లయింటో వున్నప్పుడు మాత్రం మాట దక్కించాలి" అని యామె కోరగా అత నంగీకరించాడు. చంద్రమ్మ మదరాసులో వున్నప్పుడు నెలకి యిరవైతొమ్మిదిరోజు లతడు ఈతీర్మానాన్ని అమల్లో పెడుతూనే వుంటాడు. ఆఫీసులో నౌకరుగావున్న మొదలియారుచేత కాఫీహోటలునుంచి పూరీలూ, బంగాళాదుంపలకూరా, ఆవడలూ, దధ్యోదనమూ, వగైరాలు

తెప్పించి పంచాతో అమాంతంగా చంద్రమ్మనోట నంచి కిచకిచలాడుతూ వుంటాడతను. అలాంటప్పుడామె నవ్వుతూ "వాగ్దానం మరిచిపోకండేం" అంటూ వుంటుంది.

వెంకటరా వెంత కొంటెతనం చేసినా చంద్రమ్మ యిలా కాలం వరగేసుకువస్తోంది. అయితే వక్క ఆచారంవిషయంలోమాత్రమే అత నిలా వుంటాడు. కాని తక్కిన విషయాల్లో చంద్రమ్మని నెత్తిమీద పెట్టుకుంటాడు. అతని కుటుంబస్థితి యెలా వుండంటే? ఆమె యాజ్ఞ లేకుండా అత నేమీ చెయ్యడు; అతని యిష్టం లేకుండా ఆమె యేమీ చెయ్యదు.

ఒకప్పుడో తమాషా జరిగింది. అతనికి వుల్లిపాయల పులుసంటే యిష్టం. ఆమె కది కొత్త. ద్వేషం కూడానూ. ఆమెకు పప్పువేసిన అరటికాయకూర అంటే యిష్టం. దాన్ని చూస్తే 'ఓ'క్కంటాడతను. ఈ ద్వైధీభావం యిలా వుండగా యింకొకటి వచ్చిపడింది నాటకాలంటే అతను చెవి కోసుకుంటాడు. సినీమాలంటే ఆమె ముచ్చట పడుతుంది. ఒకనాడు వెంకటరావు "థియేటరుకి వెడదాం రా" అన్నాడు. ఇద్దరూ మోటారులో కూచున్నారు. డ్రైవరు తిరిగి చూడగా అతను విక్టోరియాహాలన్నాడు. అది విని మొగం పక్కకి తిప్పుకొని ఆమె అప్పటికి నవ్వుకొని వూరుకుంది. కారు బ్రాడ్వేదగ్గిరికి వచ్చేటప్పటికి ఆమె నాలికచివరికి మాట తెచ్చుకుంది గాని యెంతో ప్రయత్నంమీద వూరుకుంది. కొంతసేపటికి మెడికల్ కాలేజీ సమీపించింది. ఆమె హృదయంలో యేమిటో గుబగుబలాడడం మొదలుపెట్టింది. చూస్తూ వుండగా కారు సెంట్రల్ స్టేషను దాటి వంతెన యెక్కింది. అప్పుడిక వూరుకుంటే లాభం లేదని అతిప్రయత్నంమీద సాహసించి "కారు మౌంటురోడ్డుకి తిప్పవోయి" అంది. డ్రైవరు మెరుపుకొట్టినట్లు ఉలికిపడి వెనక్కి తిరిగి చూశాడు. వెంకటరావు "ఏమిటే!" అన్నాడు. ఈకాస్తా అయేటప్పటికి కారు వంతెన దిగింది. మౌంటురోడ్డుకి వెళ్లే మలుపు దాటిపోతోంది. మళ్లీ సాహసించి "తిప్పు మౌంటురోడ్డు"కంది ఆమె మొగమ్మీద దృఢదీక్ష కనపడిం దతనికి. మాట్లాడలేకపోయాడు. లొంగిపోయాడుకూడానూ. ఇదంతా కనిపెట్టి డ్రైవరు కారు మెల్లిగా మౌంటురోడ్డుకి తిప్పి వెల్లింగ్డను సినీమాముందు ఆపాడు. వెంకటరావు మాట్లాడకుండా కూచోడం చూసి చంద్రమ్మ అతని జేబులో వున్న పర్సు తానే తీసి డ్రైవరుచేతికి పదిరూపాయల నోటిచ్చి "బాక్సు" అని చెప్పింది తెచ్చిన టిక్కెట్లు గూడా తనే పుచ్చుకుంది. ఇంకేమిటి చెయ్యడం? వెంకటరావు అలిసిపోయినవాడిలాగ బండి దిగాడు. తప్పు చేసిన మనిషిలాగ చంద్రమ్మ దిగింది. ఇద్దరూ మాట్లాడకుండా వెళ్లి బాక్సులో కూచున్నారు.

ఆట అయిపోయింది. ఇంటికి వచ్చారు. బట్టలు మార్చి కాళ్లూ, చేతులూ కడుక్కుని భోజనానికి కూచున్నారు. పప్పువేసి అరటికాయ వండమని చంద్రమ్మ చెప్పి వెళ్లింది. ఉల్లిపాయలపులుసు వండమని వెంకటరావు చెప్పి వెళ్లాడు. వంటలక్క యీరెండూ చేసి సుందరశివుడు చెప్పగా దొండకాయ వేపుడుకూడా చేసింది. ఆమె ముందు పప్పుకూర తేగా వెంకటరావు "నాయి దగ్గిర పెట్టెయ్యి" అని రంకె వేశాడు. ముగ్గురూ దొండకాయతోటే తిన్నారు. చంద్రమ్మ "చా"రంది. వెంకటరావు "పులుసువెయ్యి" అన్నాడు. వంటలక్కకిదేమిటో అర్థం కాలేదు. సుందరశివుడుకూడా తెల్లపోయాడు. చేసేది లేక వంటలక్క పులుసే తెచ్చి వెంకటరావుకి వడ్డించి తెల్లపోతూ చంద్రమ్మకేసి చూసింది. చంద్రమ్మ మూసి వూరుకోగా "వెయ్యి" అని వెంకటరావు మళ్లీ చెప్పాడు. సరే. వంటలక్క జడుస్తూ పులుసు వడ్డించగా చంద్రమ్మ మాట్లాడకుండా తీవ్రమైన వక్కచూపు మాత్రం భర్తమీదకి విసిరేసి చప్పుడు కాకుండా పులుసూ అన్నం తినేసింది.

భోజనా లయినాక యిద్దరూ చెరో దారినీ వెళ్లి పడకటింట్లో యెదురుపడ్డారు. దగ్గిరికి వచ్చి మొగాలెత్తి చూసుకునేటప్పటికి యిద్దరికీ కళ్లమ్మట నీళ్లు వచ్చాయి. వాళ్లమీద వాళ్లు పడి యిద్దరూ యేడ్చారు. "నేను మొండికీనుగు" నంది చంద్రమ్మ. "నేను రాక్షసు"డన్నాడు వెంకటరావు. ఆమె కళ్లతనూ, అతని కళ్లామే తుడుచుకున్నారు. వెంకటరావు ఆమె నెత్తి మంచంమీద కూచోబెట్టి తాను కిందే నుంచుని పైకి చూశాడు. "నాముద్దు చెల్లించవూ?" అంటూ చంద్రమ్మ గడ్డం పట్టుకోగా "నామాట వినవూ?" అంటూ వెంకట

రావు చెయ్యి పట్టుకున్నాడు. ఇద్దరు "సరే" అంటే "సరే" అనుకున్నారు. మర్నాడు పొద్దున్న చంద్రమ్మ "పంతులుగారు వూళ్లో వున్నప్పు డెప్పుడూ పప్పుకూర వండొద్దు. ఉల్లిపాయపులుసు నాకుకూడా వడ్డిస్తూ వుండు" అని సం॰లక్ష్మితో చెప్పింది. వెంకటరావు "అమ్మగారు కూడా వచ్చినప్పు డెప్పుడూ నాటకశాలకి తీసుకువెళ్లవద్దు. సినీమాకే వెడుతూ వుందాం" అని డ్రైవరుతో చెప్పాడు.

చెప్పవచ్చిం దేమిటంటే? ఇంత అన్యోన్యంగా వుండే దంపతులు వారు. "నేనప్పుడు చెన్నపట్నంలోనే వుంటే వారా పెళ్లికివెళ్లకే పోదురేమో" అని వకమాటూ, "వెళ్లినా నాకు ఇష్టం అవునేమో" అని వకమాటూ, "నేనుకూడా వెళ్లివుందునేమో" అని వకమాటూ అనుకుంటూ వుంటుంది చంద్రమ్మ. ఆసంగతి యెలావున్నా ఆమె "చెన్నపట్నం యెప్పుడు వెడతానా?" అని తొందరపడుతూనూవుంది. "అగ్నిహోత్రంలో వురుకుతావా" అన్న తల్లిమాటనీ, "వాడి యింటికి వెళ్లావంటే యిక నీమొగం చూడ"నన్న తండ్రిమాటనీ తీసివేయ్యలేకుండానూ వుంది. అటు ప్రేమా, యిటు వాత్సల్యమూనూ. ఇక్కడి పద్ధతినిపట్టిచూస్తే ఆప్రేమ పాములతో నిండి వున్న చందన వృక్షంలాగ దురారాధ్యంగా వుంది. అక్కడి పద్ధతినిపట్టి చూస్తే యీవాత్సల్యం కంపకట్టిన పళ్లచెట్టులాగ దుష్ప్రాప్యంగా వుంది. చంద్రమ్మకి రెండూ కావాలి. కాని ప్రకృతిమాత్రం "అటాయిటా?" అని ఆమెను కచ్చితంగా అడిగేస్తోంది.

## 3

"మునిగిపోయిందా యేమిటి వితంతు వివాహానికి వెడితే?" అని రామచంద్రం అనుకున్నాడు; గాని ధైర్యంగా వెంకటరావు చేసిన పనిని బహిరంగంగా సమర్థించడానికి సాహసించలేదు. "పెళ్లాం చచ్చిపోతేమళ్లీ పెళ్లాడడానికి సిద్ధపడే మగవాడు బుద్ధిపూర్వకంగా అంగీకరిస్తేతప్ప ఆపద్ధానికి నిర్బంధంగా వైధవ్యాన్ని విధించడంలో యేమిధర్మం వుందీ? పురుషుడిమీదకి బుద్ధి పోయే వితంతువుని మళ్లీ పెళ్లాడనిస్తేనే మంచిదీ" అని అత ననుకుంటూవుంటాడు. "అయితే వితంతు వివాహాలెందుకు నిషేధింపబడ్డాయి?" అనేప్రశ్న మధ్యమధ్య అత న్నడుగుతుంటూ వుండడమూ, అలాంటి సమయంలో వొకొక్కప్పు డుక్కిరిబిక్కిరి అవుతూ వుండడమూ, ఇంకొకప్పుడు "కిరస్తానీలూ, తురకలూ వగైరాలు స్త్రీపునర్వివాహాచారంవల్ల చెడ్డారా?" అనుకుంటూవుండడమూ,కూడా వుంది. ఏమయినా అతగాడి మనస్సు వితంతువివాహాచారంమీదకి మొగ్గివుంది.

చంద్రమ్మతల్లి యీమాట విన్నప్పణ్ణుంచీ బెంగ పెట్టుకుంది. "తన యింటో వితంతువులులేరు. ఆపిల్ల తన చుట్టంకాదు. ఎందుకువెళ్లాలీ ఆపెళ్లికి? వెడితే యేంవొరిగిందీ?" అనియీమె చర్చించుకోడం మొదలుపెట్టింది. ఈవిషయంలో యేంచెప్పబోయినా యాజులు "ఆపతితుని మాట నాదగ్గిర యెత్త"కంటాడు. "నాగతి యేమిటే?" అంటుంది చంద్రమ్మ. మూడోకొడుకుతో చెబితే "బావ కులం చెడ్డా" డంటాడు. రామచంద్రం "యేం తప్పమ్మా?" అంటాడు గాని ఆమాట లెక్కగా తోచదు. పైగా చంద్రమ్మని కోడ ళ్లెప్పుడేనా దెప్పిపోతా రేమో అని భయం వకటి. ముసలమ్మస్థితి పచ్చివెలక్కాయ గొంతుకుపడ్డట్టుంది.

చంద్రమ్మ రాకపోవడమూ, రెండుత్తరాలు రాసినా జవాబు లేకపోవడమూ చూసి వెంకటరావు బెంగపెట్టుకున్నాడు. చంద్రమ్మని విడిచి వుండడం అంటే అతనికి మనస్సు మనస్సులో వుండదు. చంద్రమ్మ పుట్టింటికి వచ్చి అతనుగూడా యిక్కడ వుంటే విశిష్టాద్వైతంలాగా, చెన్నపట్నంలో వుంటే అద్వైతంలాగా వుంటారు వారిద్దరూనూ. అత్తగారు పెట్టిన గడువుదాటాక పదిరోజులదాకా చూశా డతను. ఇక తోచింది కాదు. కోర్టులో కూడా చంద్రమ్మరూపమే కనపడడం మొదలయింది. కక్షిదారులు చెప్పే మాట లేమీ బోధపడడం లేదు. కాగితాలు చదివితే వాచకం యెప్పటిలాగే వుంటుంది కాని విషయం తల కెక్కదు. ఇంకా వూరుకుంటే వ్యవహారం చెడుతుం దని తోచింది. "మహేంద్రవాడ వెళ్లి మీవదిన్ని తీసుకురా" అని చివరి కతను సుందరశివుణ్ణి పంపించాడు.

సుందరశివరావంటే అతనికి తాతాసహోదరంబాపతు తమ్ముడు; చాలా బీదవాడు. అంచేత వెంకటరావు

తన యింటో వుంచుకుని అతనికి చదువుచెప్పిస్తున్నాడు. సుందరం వైద్యపరీక్షకి చదువుతున్నాడు.

సుందరం వచ్చేటప్పటికి యాజులు వీధి అరుగు మీద కూచున్నాడు. "నమస్కారం మామగారూ! అంతా క్షేమమా?" అని అత నడగ్గా యాజులు మొదట ఆనవాలు పట్టలేకపోయాడు. పేరు తెలిసేటప్పటికి యాజులు రుసరుసలాడుతూ "గుమ్మం దిగు ముందు. వేంకటరావుతోపాటు కులం చెడ్డావు నువ్వు" అని గదిమాడు. సుందరం మొదట తెల్లపోయాడు గాని వక్క క్షణంలో ధైర్యం తెచ్చుకుని "మీగుమ్మం యెక్కి, మీ యింట్లో భోజనం చేసి, కులం సంపాదించుకోవలసిన అవసరం మాకు లేదు. మాచంద్రమ్మవదినతో మాట్లాడవలసి వచ్చాను.వకమాటు యిలాపిలవండి"అన్నాడు. ఇందుకు యాజు లంగీకరించలేదు. "మీ వాడు వీరేశలింగంతో యెప్పుడు కలిశాడో అప్పుడే వాడికీ, మాచంద్రికీ సంబంధం వదిలిపోయింది. ఇక దానితో నువ్వు మాట్లాడ్డానికి వల్లకాదు. నాయింటి గుమ్మంలో—యెదుట కూడా నుంచోకు యిక. పో; ఛండాలుడికంటేనూ అస్పృశ్యుడవు నువ్వు. దిగూ గుమ్మం ముందు" అని యాజులన్నాడు. సుందరానికి చాలా కోపం వచ్చింది. ఏమయినా సరే రెండు వాయించా లనుకున్నాడు; గాని వదినతో మాట్లాడకుండా తొందరపడకూడ దని వస్తాయించాడు. ఇంతలో యేదో పనిమీద వీథిలోకి వస్తూ వున్న రామచంద్రం యిదంతా చూసి లోగుమ్మంలోనే వుండి చెరువుగట్టుమీద వుండ మని సుందరానికి సంజ్ఞ చేసి లోపలికి వెళ్లిపోయాడు.

"మామగారూ."

"ఛీ! అలా పిలవకు నన్ను. నువ్వసలు నాతో మాట్లాడ్డానికే వద్దూ."

"మామగారూ."

"బుద్ధి లేదూ నీకూ?"

"మామగారూ."

"వోరే మూడోవాడా, చూడూ యీ పీనుగేమిటో గంతు లేస్తున్నాడు; వకమాటిలారా."

"మూడోవాణ్ణి పిలుస్తావుటయ్యా మామా, తొందరపడకు."

ఇలా అంటూ సుందరం వూచలాగ వెళ్లిపోయాడు. "చెన్నపట్నం మాయ లన్నీ నేర్చుకుని వుంటాడు వీడు. అస లింగ్లీషే మాయలు నేర్పుతుంది. ఏలాగేనా చంద్రితో మాట్లాడ్డానికి ఏయిరుగుపొరుగునో కూచుని వుంటాడు వీడు. కనక దాన్నివాళ యిల్లు కదలనివ్వకూడదు. కోకొంపకి దొడ్డిదారి లేకపోవడం మంచిదే అయిం దిప్పుడు. అగ్నిహోత్రాలవేళదాకా యిక్కడే కూచుంటాను. తరవాతైనా వంటలోవుండమంటే సరీ యివతలికి రావడానికి వీలుండదు చంద్రికి. ఇంటోవాళ్లెవళ్లూ వీణ్ణి చూడలేదు కనక యెలాగా వీడి పప్పుడకదు" అనుకొని యాజు లక్కడే అలాగే మఠం వేసుకుని కూచున్నాడు.

## ౪

ఆయింటికి వెనక్కాల రాజుల కాళీపెరడు వుంది. రామచంద్రం సుందరాన్ని ఆదొడ్లోకి తీసుకు వచ్చాడు. చంద్రమ్మ పొట్లపాదుకీ మొండిగోడకీ మధ్య కుర్చీపీట వేసుకుని నుంచుని చాలాసేపు మాట్లాడింది. అతను వెంకటరావు స్థితి అంతా చెప్పేటప్పటికి గజగజలాడిపోయింది. "సుందరం, యేమిచెప్పనూ? అక్కడ వారూ బాగానే వున్నారు. ఇక్కడ వీరూ బాగానే వున్నారు. మధ్య నాకు వచ్చిందీ గండకత్తెర. నిన్నిప్పుడు వక్కణ్ణీ పంపించేస్తే వారు కోప్పడతారు. నీతోవచ్చేస్తే మానాన్న బతికివున్నంత కాలము పుట్టింటి ఆశ వుండదు. ఏం చెయ్యమంటావో చెప్పూ నువ్వూ. నేనక్కడికి వచ్చేదాకానైనా వారలాంటిపని చెయ్యకుండా వుండవలసింది. వుత్తరంకూడా తొందరగానే రాశారు. దానితో యిక్కడ భగ్గుమంది. సాహసిస్తే ఆడ్డేదేమీ లేదు సుమా. అయినా తొందర పడకుండా కంచెమీద పడ్డ బట్ట దీసుకున్నట్లు చెయ్యాలని చూస్తున్నాను. నాశక్తికొద్దీ ప్రయత్నిస్తాను. సాధ్యమైనంతమట్టుకు రాజీ జరిగేలాగే చూస్తాను. వీలు లేదని తోచిం దంటే వెంటనే వచ్చేస్తాను. కనకో శివరాత్రి వెళ్లి సంవత్సరాది వచ్చేదాకా నాకు సెల విమ్మని మీ అన్న

య్యతో చెప్పు. నేను కాళ్లమీదపడి బతిమాలుకున్నానని చెప్పాలిసుమా, నాయనా! మరోలాగ చెప్పావంటే నన్ను చంపుకు తిన్నట్లే. నిన్న మానాన్న అన్నమాటలు మరిచిపో. అక్కడికి వచ్చాక నీఋణం తీర్చుకుంటాను" అని చంద్రమ్మ అనేకవిధాల చెప్పింది. సుందరం మారు చెప్పలేక వెళ్లిపోయాడు.

జరిగిందంతా విని వెంకటరావు మామగారిమీద మండిపడ్డాడు. చంద్రమ్మమీద మాత్రం జాలేశాందాడు. "ఆడాళ్లకి పుట్టింటిమీద చాలా ఆశవుంటుంది. నిజమే చంద్రానికి నామీద తిరస్కారభావం లేదు. ఇదంతా అక్కడి భయమూ. దాన్నేమీ అనడానికి వీల్లేదు. ఆ గడువుకూడా చూద్దాం" అని యీతడా మెవిషయంలో శాంతి వహించాడు. మామగారికి మాత్రం బదులుతీర్చాలనుకున్నాడు. "రామచంద్రం లెక్కల్లో చేరతగ్గమనిషి. అతణ్ణి సంస్కారంలోకి దింపితినా ఆసత్తో ముఖిసోమయాజులుగారికి పరాభవం చేశామన్నమాటే" అనికూడా అనుకున్నాడు.

వీరేశలింగంపంతులు పట్టుదల సామాన్యమైనది గాదు. ఇంతట్లో యింకో స్త్రీ డరుకూతురు మళ్లీ పెళ్లాడడానికి తయారయింది. ఒక్క పౌరోహిత్యం తప్ప తక్కిన కార్యక్రమం అంతా వెంకటరావు స్వయంగానడిపించాడు. ఆపెళ్లిచాలా వైభవంగాఅయింది. ఈసారి వేంకటరావు పెళ్లికూతురూ పెళ్లికొడుకూ వడ్డించగా భోజనం చేసిన వారిలో చేరాడు. పత్రికలన్నీ యీవివాహం సంగతి వివరంగా ప్రకటించాయి. పైగా ఆంధ్రపత్రిక వెంకటరావు చాకచక్యాన్నభినందిస్తూ పంతులు తరవాత ఈ కార్యభారం వహించడానికన్నివిధాలా అతనికే అర్హత వుందని ప్రశంస చేసింది.

ఈవార్త మహేంద్రవాడలో మరిడయ్య బ్రాహ్మల కందరికీ చదివి వినిపించాడు. వూరంతా గుసగుసలాడిపోయింది. యాజులు మండిపడ్డాడు. చంద్రమ్మ నిర్ఘాంతపడిపోయింది. "ఇప్పుడేమంటావు? నేను చెప్పలేదూ? వాడు ఛండాలుడు. కులం చెరపడానికీ నీగొంతుకు కొయ్యడానికీ పుట్టాడు. పద రామచంద్రపురం; మనోవృత్తిదావా పడేద్దాం" అని యాజులు హేళనగా చెప్పగా నామె నెత్తీ నోరూ బాదుకుంటూ కూలపడింది.

తల్లీకూతురూ చాలానే పేడ్చారు. రామచంద్రం చంద్రమ్మని వూరడించలేకపోయాడు. వారంరోజులు చంద్రమ్మ నిద్రాహారా లెరగదు.

తరుచు చంద్రమ్మని చూసినప్పుడల్లా యేదో గొణుక్కుంటూవుండే యాజు లొకనాడు ఆమెని దగ్గిరికి పిల్చి "యెందుకేడుస్తావు? వాడు చచ్చినవాడూ కాలేదు, బతికినవాడూ కాలేదూ. నా కపకీర్తి తేకు. పద రామేశ్వరం" అన్నాడు. దానిమీద చంద్రమ్మ నూతిలో పడపోయేదాకా వచ్చింది. ముసలమ్మ "దాన్నిలాగేనా బతకనిస్తారూ?" అంటూ అనేకవిధాల యేడ్చింది. దానికి సమాధానం చెప్పకుండా "చావండి ముండల్లారా" అంటూ యాజులు స్నానానికి వెళ్లిపోయాడు.

౫

ఇది యిలా వుండగా సోమమ్మభర్త మెయిలుబండి వచ్చాటప్పుడు లైకాక్లియ రండిం వపోతూయింజక్ కింద పడట్టూ, కుడిచెయ్యీ, కుడికాలూ తెగిపోయినట్లూ, ఆసుపత్రిలో వున్నట్లూ కలకత్తానుంచి తంతి వచ్చింది. "ఇంగ్లీషు చదువు వచ్చాక దేశంలో అకాలమరణాలూ, వక్రబుద్ధులూ కాకపోతే మరేం వస్తాయీ?" అనుకుంటూ యాజులు చెరువుకి వెళ్లిపోయాడు. రామచంద్రానికి తండ్రిమీద చాలా కోపం వచ్చింది. "నల్లరాయీ. శ్రమధర్మాలు లేవు" అంటూ అతను తల్లినడిగి రూపాయలు పుచ్చుకుని కలకత్తా వెళ్లాడు.

సోమమ్మ యింతవరకూ చంద్రమ్మ భవిష్యత్తుని గురించి యోచిస్తూ కొంచెం దుఃఖంగా వుండేది. పాపమిప్పుడామెకి తన భవిష్యత్తును గురించే యేడవ్వాలసి వచ్చింది. కులం చెడ్డా చంద్రమ్మ మొగుడు బతికీబాగానే వున్నాడు. తనమొగుడిప్పుడేమైపోతాడో! బతికినా కాలూ చెయ్యీ లేని మొండెం. ఏం సుఖమూ? సోమమ్మా, చంద్రమ్మా, ముసలావిడా యిలా అనుకునేయేడుస్తున్నారు. ఈయాపత్తువల్ల చంద్రమ్మకి తన్ను గురించిన దుఃఖం కొంచెం మరుపు వచ్చింది.

మర్నాడు "కుడిచెయ్యీ,కుడికాలూ బండేతగ్గొట్టింది. దెబ్బతగిలి కమిలిపోవడంచేత డాక్టర్లు యెడమ పాదం తీసేశారు. కుడికన్ను పోయింది. ఎడమ కన్ను వాచివుంది"అని రామచంద్రం తంతియిచ్చాడు. ఇక్కడ ఆడాళ్లిక లాభం లేదనుకున్నారు. యాజులు సోమమ్మని వకటిరెండుమాట్లు యాదాలాభంగా వోదార్చాడు. ఆ మర్నాడు రామచంద్రం వచ్చి అంతా అయిపోయిందని చెప్పాడు.

యాజులు చంద్రమ్మని "లేడనుకో" అన్న మొగుడు సోమమ్మకి లేకనే పోయాడు. సోమమ్మ కెలావున్నా చంద్రమ్మకిప్పుడు భర్తవిలువ బాగా తెలిసివచ్చింది. "ఏ వేళ కేమిటో యెవరికీ బోధపడదు. ఎక్కడ వుండవలసినవాళ్లక్కడ వుండాలి. శాస్త్రమూ మొగుడూ అంటే మొగుణ్ణి వద్దనే శాస్త్రం యెందుకూ? నన్నువీళ్లంతా వెలిపెట్టినా నాభర్తని కొలుచుకుంటూ నేను సుఖంగానే వుంటాను. వితంతువివాహాలితో వారి కొక్కరికేసమ్మంధం వుందా యేమిటి? వీళ్లేకపోతే మేమూ ఆపేటలోనే కాపరం వుంటాము" అనుకుంది చంద్రమ్మ. ఇకయిక్కడ క్షణం వుండడంకూడా తప్పనుకుంది. "వుండడం యెలాగా?" అనికూడా అనిపించింది.

సోమమ్మ అత్తారివూరు మండపేట. "మీఅమ్మాయిని పదోనాటికేనా తీసుకురావలసిందని కబురువచ్చింది. చంద్రమ్మకి మరిది చచ్చిపోయాడన్నప్పటికంటే ఎక్కువ దుఃఖం వచ్చింది. పద్ధానుగేళ్లు నిండని పిల్లకి జుట్టు తీసెయ్యడం అంటే ముసలమ్మకి కూడా వోఘాయిత్యంగా తోచింది. కాని యాజులు పంపాలన్నాడు. తొమ్మిదోనాటిరాత్రిదాకా ముసలావిడ జరుపుకుని వచ్చింది. యాజులు భోజనాలవేళ తెల్లవారగట్ల ప్రయాణం తప్పదనేటప్పటికి ముసలావిడ "యేం చేసినా సరే" అని మనస్సులో అనుకుని నింపాదిగా యెదురుకుంది. "ముక్కుపచ్చ లారలేదు. పరికిణీల సరదా తీరనే లేదు. అప్పుడే జుట్టు తీయించేస్తే చూడలే నంటోంది పెద్దమ్మాయి" అని యీావిడ నింపాదిగా అందుకుంది. "దానిమాట లెక్కేమిటి?" అని యాజు లనగా "నేనూ చూడలే"నంది. "ఏడిసినట్టుగానే వుంది. సర్వతోముఖయాజులుగారి పెళ్లాంపీనుక్కి వచ్చిన పాట్లు యిది? నోరు మూసుకో యీపాటి"కని ముసలాయన భీకరంగా పలకగా "ముందు నాపీకి పిసికేసి తరవాత మీయిష్టం వచ్చినచోటికి తీసుకువెళ్లండి" అని ముసలావిడ ఝూంకారంగా పలికింది.

ఏమిటీ? తన యింట్లో ఆడాళ్లిలా యెదురుకుంటారని యాజు లెప్పుడూ అనుకోలేదు. దీనితో గొంతుక నొక్కేసినట్లయిపోయిం దతనికి. అతిప్రయత్నం చెయ్యగా మాట తారకస్థాయిలో వచ్చింది. అతను యెనిమిదో అట్టం ప్రారంభించాటప్పటికి రామచంద్రానికి రక్తం వుడుకెత్తిపోయింది. "గావుకేక వేస్తావెందుకూ? నువ్వెంత తిట్టినా లాభం లేదు. చెల్లాయి కిప్పుడు వపనం చేయించకపోతే ప్రపంచకం మునిగీ పోదు; నీ బ్రాహ్మణ్యానికి భంగమూ రాదూ. ఆవచ్చినవాడు పుణ్యాత్ముడే అయితే అతని వుత్తరలోకా లేవీ చెడిపోవు. నీమనస్సు రాయా, యినుమా? దుఃఖం యెరగవేమీ? చాలించు వేషాలు. ఇదంతా చిన్నాడు చేస్తున్నాడు. అయినా దాన్ని మండపేట యెవడు తీసుకువెడతాడో చూస్తా"నని వురిమాడు. "ఏమిట్రే?" అన్నాడు యాజులు. "నువ్వు దుంపశుద్ధి అయిపోతా"వన్నాడు. "తక్షణం యింట్లోనుంచి లేచిపో" అన్నాడు. ఇంకా యేమిటో అన్నాడు; గాని రామచంద్రం జడవలేదు. అతను వెనకా ముందూకూడా చూడలేదు. తండ్రికి సరిగా మాట్లాడాడు. "తెల్లవారగట్ల యెవడడ్డుకుంటాడో చూస్తా" నంటూ లేచిపోయాడు యాజులు. "నీకు వచ్చిన భయం లేదమ్మా చెల్లీ. నిన్నెవడు తీసుకెళ్లగలడో రానియ్యి" అని రామచంద్రం రంకెవేసి చెప్పాడు. ఇదంతా వింటూ వున్న రామచంద్రం భార్య వచ్చి చెయ్యిపట్టుకుని సోమమ్మని తన గదిలోకి తీసుకుపోయింది.

"ఆడపీనుగులి కీదుర్బుద్ధి పుట్టించినవాడు రామిగా"డని మూడోవాడు చెప్పగా "హో"నని యాజులు వాలంతా గంతు లేశాడు.

ఏవరే మనుకున్నారో తరవాత మండపేటప్రయాణం జరగలేదు. మర్నాడు సాయంత్రందాకా. సోమమ్మ రామచంద్రం గదిలోనుంచి యివతలికి రాలేదు. అంటే వచ్చినా తండ్రికీ మూడోవాడికీ కనపడలేదు.

"నాతండ్రి యీగండం తప్పించా" డని రామచంద్రాన్ని మెచ్చుకుంది ముసలావిడ. కోడల్నికూడా ఆదరించింది. ఇక భయం లేదనుకుంది చంద్రమ్మ. ఆమెకి కొత్తధైర్యం కలిగింది.

కాని సోమమ్మని చూస్తే ఆమె కడుపు చెరువై పోతోంది. "ఇక దీని బతుకేంగానూ?" అనుకొనేటప్పటి కెవరో "నీమొగుణ్ణడుగు" అన్నట్లయింది. దానితో చంద్రమ్మ హృదయం కలిగిపోయింది.

"వారు చేసిన పని తప్పనుకున్నాను. అది తప్పెలా అయిందీ? ఇలాంటి నోరెరగని పిల్ల లెందరిలా అయిపోయారో. వాళ్ళ గతియేమిటి? వైధవరికం మంచిదంటే యిలాంటివాళ్ళకా? రామరామా! శాస్త్రిలు రాసిన వాళ్ళు బిడ్డల్ని కన్నవాళ్ళా గొడ్డువాళ్ళా?" ఈవిధంగా చంద్రమ్మకి ఆందోళనం ప్రారంభం అయింది.

ఈసమయంలో రామచంద్రం వచ్చి "చెల్లాయీ! ఇప్పుడు చెప్పూ. బావ మంచివాడా చెడ్డవాడా? అతను చేసిన పనివల్ల కులం చెడుతుందా బాగుపడుతుందా! శాస్త్రిలు రాసినవాళ్ళూ, వాట్లని చదువుకున్నవాళ్ళూ రాక్షసులు. వేదాలు చదివితే యేమిటి, అగ్నిహోత్రాలు చేస్తే యేమిటి దయాసత్యశౌచాలు లేనప్పుడు?" అని అడిగాడు. చంద్రమ్మ హృదయం మళ్ళీ కలిగిపోయింది. "అవును బుల్లన్నయ్యా! వారు చేసినపని నిజంగా దేవతల కిష్టమైనట్లు తోస్తోంది నాకిప్పుడు. చెల్లి దుఃఖం చూస్తేనే నాకిలా వుంది; దాని కెలా వుందో? మొగుడుమొగం యెరగని పిల్ల ముండామొయ్యడం అంటే యేమిటోయి! నాన్నగుణాలు తలుచుకుంటే వొళ్ళు మండిపోతోంది నాకిప్పుడు. నాన్న ఆజ్ఞ యేమిటి? నాయింటికి నన్ను తీసుకువెళ్ళు నాయనా! రెండుత్తరాలు రాసినా, సుందరాన్ని పంపినా, ఆచారంకోసం కొట్టుకుంటూ వెళ్ళలేకపోయాను. దానికి ప్రాయశ్చిత్తం యేమిటో తెలుసునా? నేను వారు చేసే పనికి సాయపడతాను. బాలవితంతువులుంటే నాయింట్లో పెంచి నాచేతులతో పెళ్ళిళ్ళు చేసి పంపిస్తాను" అని చంద్రమ్మ ఆవేశంతో చెప్పింది. రామచంద్రం "అలా అయితే—" అని యేమో చెప్పపోయేటప్పటికి చంద్రమ్మ తెలిసింది; మంచిమాట "జ్ఞాపకం చేశావు. నాచెల్లెలు దిక్కులేనిపక్షి అయివుండగా పయి వాళ్ళమాట యెందుకూ? ముందు దీనికే సౌభాగ్యం కలిగిస్తాను నేను. అంటే నువ్వుకూడా సాయం చెయ్యాలి సుమా అన్నయ్యా! మీ బావపేర వెంటనే వుత్తరం రాయి. నిక్షేపంలాంటి సుందరశివుడింట్లోనే వున్నాడు. చెల్లికి తగినవాడతను. చెల్లిచేత నేను వప్పిస్తాను. నాన్న లెక్కేమిటి మనకి? అమ్మ అంగీకరించకపోయినా నే సాగనూ. రాసెయ్యవోయివుత్తరం. నుంచున్నపాళంగా రాసెయ్యి. శ్రీహరీ! ఎంత పాడుశాస్త్రిలోయి మనవి? చిన్నతనంలో మొగుడు చచ్చిపోయిన పిల్ల లనేకమంది పాడుపనులు చేస్తూవుంటే మనం చూస్తున్నాం. అంతకంటే పెళ్ళాడడం తప్పా? చదువుకున్నవాళ్ళు వాళ్ళనేమీ చెయ్యలేరు. ఆడదానికి మళ్ళీ పెళ్ళి అనేటప్పటికి వాళ్ళ నవనాడులూ కుంగిపోతాయి. ఎంతవయస్సులో పెళ్ళాం చచ్చిపోయినా మొగాడు మళ్ళీ పెళ్ళాడవచ్చు. చిన్నతనంలో వైధవరికం వచ్చినా ఆడది అలాగే పడివుండాలా? పెంటమీద పారెయ్యవోయి ఆపుస్తకాలూ. ఎంత దౌర్జన్యమూ? ఆడాళ్ళ బతుకెంతహీనంగా వుందీ? ఆడదంటే మొగాడి కెంత తేలికా? నిజంగా యీభేదం దేవుడేర్పరిచిందా మొగాళ్ళు కల్పించిందా? అన్నయ్యా! ఇక చూడకు. మీబావకి వుత్తరం రాసెయ్యి" అని చాలా తొందరపెట్టింది "ఇదిగో రాసి తెస్తున్నా" నని రామచంద్రం లేచివెళ్ళాడు.

౬

జాబు రాసి తెస్తా నన్న రామచంద్రం రాయకుండానే వెనక్కివచ్చి "సమయానికి నేను వీధిలో వుండడం మంచిదే అయింది. బావదగ్గిరనుంచివుత్తరం వచ్చింది" అని వక కవరామె కిచ్చాడు. ఆ వుత్తరంలో యిలా వుంది:—

మదరాసు

౧౫-౯-౧౯౨౨.

"నా చంద్రా!

గొప్ప ఆపత్తుసంభవించినందుకు చాలా విచారించాను. ఏం చెయ్యగలమూ? నేనిప్పుడు రాలేను. రావడానికి వీ ల్లేకపోవడం నువ్వే యెరుగుదువు. సోమమ్మకి నాయోదార్పు నువ్వే అందించు."

"ఏకారణంచేతనైతే యేమి? నువ్వక్కడ వుండిపోవడం ఇప్పుడు చాలా మంచిదే అయింది. నేను చేసిన పని మంచిదో చెడ్డదో యిప్పుడేనా నీకు బాగా బోధపడుతుందనుకుంటాను. కనికరమూ, జాలీ, ఆడవాళ్ళకికంటే మొగాళ్ళకి యెక్కువగా వుంటాయని నేను చెప్పను; కాని హిందూస్త్రీకి భావస్వాతంత్ర్యమేనా లేదు. ఈజాతి యొక్క అధఃపతనానికిదే కారణమని నేను తలుస్తాను. స్త్రీకి పురుషుని యెడల అచంచలభక్తి వుండాలంటే మంచిదే. అయితే స్త్రీయెడల పురుషుని కకలుషప్రేమ వుండవద్దూ? ఈదేశంలో పురుషులకే విజ్ఞానం చాలని రోజులివి. ఇక స్త్రీల సంగతి చెప్పడం యెందుకూ? నావుద్దేశంలో హిందూస్త్రీ తన హక్కులను గమనించుకోగలగడానికి ముందు పురుషుడే తన దౌర్జన్యాన్ని తగ్గించుకోవడం మంచిది. పురుషుడు చేసిన అపకారాలూ, అత్యాచారాలూ ఆమె తెలుసుకోవడానికి ముందు పురుషుడే వాటి ఆనవాళ్లుకూడా లేకుండా చేసుకోవడం మంచిది."

"నాకు నిర్బంధంగా వైధవ్యాన్ని విధించడానికి నువ్వెవడవు?' అని యే బాలవితంతువేనా తిరగబడి నిలవదీసి అడిగితే పురుషుడేం జవాబు చెప్పగలడూ? మన సంఘంలో స్త్రీల నడచివేసిన అపరాధంలో పురుషులందరితో బాటు నేనుగూడా భాగస్వామినే. ఈసంగతి నాకెప్పుడు బాగా బోధపడిందో అప్పణ్ణుంచీ నాహృదయం బద్దలైపోతోంది. నేను వితంతువివాహాల్లో పాల్గొనడానికీ యాత్మజ్ఞానమే కారణం. ఈయావేదన నిన్నక్కడ విడిచివచ్చిన వెంటనే ప్రారంభం అయింది. అంచేతనే నీతో చెప్పకుండానే నేనిందులో ప్రవేశించాను. ఈవిషయంలో నీబుద్ధి పరిపక్వం కాలేదని నే నెరుగుదును. అయితేలే నీబుద్ధి అతినిశితమైనది. అచిరకాలంలోనే నువ్వు నామార్గంలోకి వచ్చి నాచేత యింకా అనేకసత్కార్యాలు చేయిస్తావు. అక్కడ నువ్వెన్నాళ్లు వుండాలని వుంటే అన్నాళ్లూ వుండు. నేను నిరపరాధినని నీ కెప్పుడు తోస్తే అప్పుడే రా. సోమమ్మకోసం నువ్వింకా కొన్నాళ్లు అక్కడ వుండడం కూడా అవసరమే. అయినా నీదర్శనంకోసం యెదురుతెన్నులు చూస్తున్నాను.

ఇట్లు
నీదాసుడు—వేంకటరావు"

ఈవుత్తరం పూర్తిగా చదివేటప్పటికి చంద్రమ్మకేదో మెరుపుకొట్టినట్లయింది. వేంకటరావుయొక్క నిజస్వరూప మామెకిప్పుడు బాగా బోధపడింది. "అక్కడ–వారి దగ్గిర దేవతాంశ వుంది. ఆదివ్యమంగళవిగ్రహాన్ని విడిచి యిక్కడ వుండడం యేమిటే?" అని తోచిందామెకి. తటాలున లేచి నుంచుంది. ఆమెకళ్లల్లోనుంచి అనంతతేజఃస్ఫులింగాలు పుంఖానుపుంఖాలుగా దుముకుతూ వున్నాయి. ఆమెముఖం దర్శనీయంగానూ దుర్నిరీక్ష్యంగానూ కూడా వుంది. రామచంద్రం ఆముఖాన్ని సరిగా చూడలేక తల వంచుకుని "బావ యేం రాశాడు చెల్లీ?" అని అడిగాను.

ఉత్తరం అతని చేతి కిచ్చి వక్క క్షణం ఆమె అలాగే నుంచుంది. ఇంతలో అతను వుత్తరం చదివేసి చకితుడైనాడు. అది చూసి యామె "బుల్లన్నయ్యా! చదవడం అయిందా? నాన్న పుల్లేటిసుత్తి యజ్ఞానికి వెడతాడు కాబోలు. వకమాటిలా పిలుస్తావా? ఇక క్షణం వుండనిక్కడ. నన్ను నువ్వు తీసుకువెడతావా నేనే వెళ్లిపోనా? వారెంత మంచివారూ? నామీద యెంత దయా? నేనెంత అదృష్టవంతురాలినీ? పోనీ నాన్ననిలా పిలుచుకురావడం యెందుకూ? 'పెద్దమ్మాయి తన యింటికి వెళ్లిపోతోం' దనీ, 'యిక క్షణమేనా యిక్కడ వుండ' దనీ చెప్పిరా. 'వారు చేసిన పనిలో వున్న గొప్పతనాన్ని తాను బాగా గ్రహించిం' దనీ, 'ఈసంగతి నీ కిష్టం లేకపోతే తన్ను మరిచిపొమ్మని చెప్పిం' దనీ చెప్పిరా" అని తొందలు విడిపించింది.

కాని రామచంద్రం "నిదానించ" మన్నాడు. "నువ్వు తొక్కవలసిన దారే తొక్కావు. దానికోసం యింత తొందరపడ నక్కరలేదు" అన్నాడు. "నాన్నని వెళ్లిపోనియ్యి. చిన్నన్నయ్యకూడా వెళ్లిపోతాడు. ఇక అమ్మ? అమ్మని నువ్వేనా వొప్పించవచ్చు నేనేనా వొప్పించవచ్చు. ముందొకమాటు చెల్లితో మాట్లాడకుండా బుడుంగుమంటే గేలం వేస్తే యెలాగా? తీరా అది యిష్టపడకపోతే యేమిటే చెయ్యడం?" అనికూడా అడిగాడు. కాని చంద్రమ్మకి నెమ్మది రాలేదు. "నాన్న వుంటేమాత్రం బాధ యేమిటోయి? నాయింటికి నేను వెళ్లిపోడానికి నాకు చాటేమిటి? చెల్లి వొప్పుకుంటుందా

సుఖపడుతుంది. లేకపోతే దురదృష్టవతులు లోకంలో యెందరు లేరూ? దానికి విరాగిణిగా వుండాలని వుంటే మాట్లాడను. ఇంతకీ యీవేళ మెయిలెలాగా దొరకదూ. ఇటు సూర్యుడటు పొడిచినా రేపుప్రయాణం తప్పదుసుమా. 'నేను వస్తున్నా'నని చెప్పి రామచంద్రపురం వెళ్లి తంతి యిచ్చిరా ముందు. క్షణం యుగంలా వుంది నాకు. వారిని చూడాలి. కలకలలాడే ఆముఖమండలం చూడాలి. ఆజ్ఞని జవదాటినా వారు నన్ను తిరస్కరించ లేడు. రెణ్ణెల్లయింది నేను వచ్చి. వంటలక్క తిప్పలుపెట్టకుండా వేళకి భోజనమూ, ఫలహారమూ అమర్చిపెడుతోందో లేదో? ముందు నాకివ్వకుండా కాఫీ పుచ్చుకోవడం యెరగరు వారు. ఎంత చిక్కిపోయారో? బుల్లన్నయ్యా! మెయిలన్నమాట యేమిటే? ప్యాసెంజరుకే వెడదాం పదవోయి" అని యామె మళ్లీ తొందర పెట్టింది.

రామచంద్రం మళ్లీ అందుకున్నాడు: "కాదూ కూడదు ప్యాసెంజరుకే వెళ్లాలని నువ్వు తొందరపడితే నాయభ్యంతరం లేదు; కాని మెయిలయితే రేపుసాయంత్రందాకా వుండవలసివస్తుందనీ, ప్యాసెంజరైతే రేపు మధ్యాహ్నమే వెళ్లవచ్చుననీ అనుకోకు. మెయిలయితే యెల్లుండి వుదయం యెనిమిదిగంటలికే వెడతాం. ప్యాసెంజరైతే పదకొండు దాటితే గాని వెళ్లలేము. అప్పటికి బావ కోర్టుకి వెళ్లిపోతాడు. నాలుగేనా అయితే గాని యింటికి రాడు. ఏంలాభమూ? కనక ప్రయాణంకోసం తొందరపడకు. ముందు చెల్లాయిసంగతి ఆలోచించు" అని అత నంటూ వుండగా ఆమాటలు విని సోమమ్మ అక్కడికి వచ్చి "వెళ్లిపోతావుటే అక్కయ్యా?" అంటూ యేడుస్తూ చంద్రమ్మని కౌగిలించుకుంది. చంద్రమ్మ ఆమెను పొదివిపట్టి "లేదమ్మా! ఇవాళ వుంటాను. రేపూ ప్రయాణం. ఈనరకంలో యింకా యెన్నాళ్లుండమంటావూ? నే నుండలేను తల్లీ! మీ బావని చూడకుండా వక్కక్షణం వుండలేను నేనింక. నువ్వుకూడా వస్తావా చెల్లీ? మీబావ యెంత మంచివారో యెరుగుదువా? చెబుతా రా" అని రామచంద్రం గదిలోకి తీసుకుపోయింది.

## ౭

ఆరాత్రంతా చంద్రమ్మా, సోమమ్మా వాదోపవాదాలు చేసుకున్నారు. రామచంద్రం కూడా పెళ్లాడమనడం చూసి సోమమ్మ సిగ్గుపడుతూ పన్నెండుగంటలికి తల వూపింది. మర్నాడు ప్రయాణాలు నిశ్చయమైనాయి. రామచంద్రం భార్య "మన కెందుకూ?" అని కొంత సేపూ, "పోనీ తీసుకువెళ్లి అప్పగించేసిరండి" అని కొంత సేపూ, "ఇక్కడైతే పెరిగిన వూరూ, కొట్టిన పిండీనీ. చెన్నాపట్నంలో మీ రేమి చెయ్యగలరూ?" అని కొంతసేపూ, "స్వంతంగా సంపాదించే శక్తిలేకపోతే యెంత దగ్గరవాళ్ల కేనా చివరికి బరువౌతా" రని కొంతసేపూ చెప్పి, చంద్రమ్మ పట్టుపట్టడం చేత తాను కూడా చెన్నపట్నంలో వుండిపోడానికి బ్రహ్మాండంమీద వప్పుకుంది.

నాలుగ్గడియల రాత్రివేళ లేచి యిదేమీ యెరగని యాజులూ, మూడోవాడూ, ముసలావిడతో మాత్రం చెప్పి మండపేటమీదుగా పుల్లేటికుర్రు వెళ్లిపోయారు. వారలా గుమ్మం దిగడంతోటే చంద్రమ్మ వెళ్లి తల్లి పక్కలో కూచుని "నేనివాళ వెళ్లిపోతా"నని గొడవ మొదలుపెట్టింది. ఇది విని ముసలావిడ వులికిపడి లేచి కూచుంది. చంద్రమ్మ వకొక్కటే వకొక్కటే తన వుద్దేశాలన్నీ చెప్పుకొని వచ్చింది. "కొంపముంచుతావా?" అని కొంతసేపూ, "మీయిద్దరికోసమూ గూడా నీళ్లు వదులుకోవలిసిందేనా?" అని కొంతసేపూ, "చిన్నమ్మాయిగూడా నీలాగే పచ్చగావుంటే చూడలేకా? ఐపర్లీ తప్పనీ. గడ్డు పీకేస్తారు లోకులు. ఆపైని మీ నాన్న నానాళం పడతారు" అని కొంతసేపూ, "వెంటనే పెళ్లిచేస్తే లోకం బొత్తిగా హర్షించదూ. యేడాదేనా పాతబడనివ్వరాదూ?" అని కొంతసేపూ, "దానికి నేను మాడని లోటు కలక్కుండా చూస్తావా?" అని కొంత సేపూ, అడ్డు చెప్పిచెప్పి చివరికి కాకులు కూసేటప్పుడు చల్లగా వొప్పుకు వూరుకుంది. వెంటనే రామచంద్రం రెండు జట్కాబళ్లు కుదిర్చి వచ్చాడు.

ముసలావిడ సోమమ్మని దగ్గిర కూచోపెట్టుకుని దుఃఖిస్తూ, వోదారుస్తూ, సంతోషిస్తూ, జపిస్తూ, ధైర్యం తెచ్చుకుంటూ, వెనక్కితీస్తూ, స్థిరపరుస్తూ, మాట్లాడుతూ

వుండగా తొమ్మిదిన్నర అయేటప్పటికి చంద్రమ్మ వంట చేసేసింది. పదిన్నరకి భోజనాలయినాయి. పన్నెండింటికి జట్కాలెక్కారు. ముసలావిడ విడవలేక విడవలేక నెన క్కి వచ్చింది. ఇరుగూపొరుగూ అడగ్గా "నల్లా ళ్ళట్టే పెట్టుకుని పంపేస్తుంది" అని చెప్పింది గాని యెవరూ నమ్మలేదు. "అక్కడ బావగారు వెళవసుండల పెళ్ళిళ్ల లో తిరగడమూ, ఇక్కడ మొగుడు చచ్చిపోవడమూ, ఈప్రయాణమూ చూడగా సోమమ్మ మళ్లీ పెళ్లాడేలా వుంది" అని నలుగురూ చెప్పుకున్నారు.

మూడుగంటలకి లోపుగానే జట్కాలు ద్వార పూడి చేరాయి. చంద్రమ్మ నూరురూపాయల నోటివ్వగా రామచంద్రం నాలుగూ సెకండుక్లాసు టిక్కెట్లే కొని చెన్నపట్నం తంతి యిచ్చేశాడు. అయిదున్నరకి వారి సక్కింమకొని మెయిలు ద్వారపూడి విడిచింది.

౮

తంతి చూసుకుని వెంకటరావూ, సుందరశివుడూ ఆశ్చర్యపడ్డారు. చంద్రమ్మ యింతలో వస్తుందనీ అథవా వచ్చినా, రామచంద్రమూ, అతని పెళ్లామూ, పైగా సోమమ్మా వస్తారనీ వారెప్పుడూ అనుకోలేదు. "ఏమిటి తమ్ముడూ!" అని వెంకటరావు అడగ్గా "నీవుత్తరం వక విధంగా ఫిరంగిలాగా వక విధంగా సంజీవిలాగా పని చేసింది. అక్కడ కోట బద్దలై పోయింది. జయలక్ష్మి నిన్ను పొందడానికి మేఘాలమీద యెగిరివస్తోంది" అని సుందరం చెప్పాడు.

ఇద్దరూ యేడుగంటల ప్యాసెంజరులో బయలుదేరి పొన్నేరివద్దిరికి యెదురు వచ్చారు. భర్త బండిలోకి రావడంతోటే చంద్రమ్మముందు పాదాభివందనం చేసి తరవాత సోమమ్మ ప్రస్తావన చేసింది. అందరికీ కళ్ల మ్మట నీళ్లు వచ్చాయి. వెంకటరావు సోమమ్మని పొదివిపట్టుకుని వోదార్చాడు. చంద్రమ్మ దుఃఖాశ్రువులతో నిండివున్న కళ్లల్లో ఆనందం కెరటాలు వేస్తూవుండగా "ఆపత్తులో వుండిన్నీ సంతోషవార్త చెబుతున్నాను. మా చెల్లిని పెళ్లికూతుర్ని చేసే తీసుకువచ్చా" నంది. ఇది విని వెంకటరావు నిర్విణ్ణుడైనాడు. "చంద్రా! ఏమన్నావూ?" అన్నాడు. తన చెవులనే అతను నమ్మలేకపోయాడు. సుందరశివు డన్నట్లు చంద్రమ్మ జయలక్ష్మి లాగే అతనికి తోచింది. శరీరం అంతా గరిపొడిచింది. నూతనశక్తి వచ్చిన ట్లయింది. వెంటనే అతను చంద్రమ్మ రెండుచేతులూ పట్టుకుని "చంద్రా! నీబుద్ధి యింత పరిపక్వ మైన దని గ్రహించలేకపోయాను. నేనెంత ధన్యుణ్ణి!" అని పొంగిపోయాడు.

బండి కదిలింది. బేసిన్ బ్రిడ్జి వచ్చాటప్పటి కందరికీగూడా యెన్నో యుగాలు గడిచిపోయినట్లు తోచింది. బండి ఆగడంతోటే వెంకటరావు "తప్పు చేశాము సుమా తమ్ముడూ" అనేటప్పటికి "దిద్దుకుందాం" అని చెప్పి సుందరశివుడు బండి దిగి మాయ మైనాడు.

బండి బేసిన్ బ్రిడ్జిలో వున్న ముప్పయినిమిషాలూ చంద్రమ్మకీ వెంకటరావుకీ చాలా భారంగా తోచాయి. "ఎప్పుడిల్లు చేరుకుంటామా? ఒకరియెదట ఒకరి హృదయభారాలు విప్పిచెప్పుకుని ఎప్పు డానందిద్దామా?" అని యిద్దరూకూడా తహతహలాడిపోతున్నారు. అప్పాయావా వున్న స్థితి గ్రహించి సోమమ్మ "మళ్లీ పెళ్లాడి యిలాంటి ఆనందం అనుభవించకుండా యెందుకట్టిగా యెందు కుంకిపోవాలి?" అనుకుంది. రామచంద్రం భార్య వెంకటరావు చంద్రమ్మయెడల చూపిస్తూ వున్న ప్రేమాదరాలు చూసి అలాంటి అనుభవం తనకి వస్తుందా? అని గుటకలు మింగుతూ మధ్యమధ్య రామచంద్రంకేసి మిడుతూమిడుతూ చూస్తూ కూచుంది. రామచంద్రం భవిష్యదాలోచనలో మునిగివున్నాడు.

ఈస్థితిలో బండి సెంట్రల్ స్టేషను చేరింది మొదలి యారు కూలీల అడావిడి తగ్గించి తలుపు తీశాటప్పటికి అయిమపూలదండలతో సుందరశివుడు బండిలోకి వురికాడు. వెంకటరావుకి బ్రహ్మానందం వచ్చింది. వెంటనే అతను వొక్కొక్క దండే పుచ్చుకుని ముందు చంద్రమ్మకీ, తరవాత సోమమ్మకీ, రామచంద్రానికీ, అతని భార్యకీ వేశాడు. అది ముగవడంతోటే చంద్రమ్మ మిగిలిన దండ తాను పుచ్చుకుని భర్త మెడలో వేసి తన మెడలో వున్న దండ తీసి చెల్లెలిచేతి కిచ్చి "ఈదండ సుందరంబావకి వెయ్యవే చెల్లీ" అని దగ్గిరికి తీసుకు

వచ్చింది. సోమమ్మ మనుసిగ్గూ, సంతోషపారవశ్యమూ కలిసిన విలక్షణావేశంతో చంద్రమ్మ చెప్పినట్లు చెయ్యగా సుందరం ఆనందంతో మెడ వంచాడు. సామానంతా మొదలియా రొక జట్కామీద వేయించాక అందరూ సొంత మోటా రొకటీ అద్దెమోటా రొకటీ యెక్కి వెళ్లిపోయారు.

౬

అక్కడ పుల్లేటికుర్తిలో యజ్ఞంమీద యజ్ఞం తగులగా యాజులూ, మూడోవాడూ మూడువందల రూపాయలతో పదిహేనురోజుల కింటికి వచ్చారు. వారు దేవతార్చన పెట్టి, మూటలూదింపి మండువాలో కూచునేటప్పటికి ముసలావిడ వణుకుతూ ఒక ఉత్తరం యిచ్చింది. యాజులు దాన్ని విప్పి చూచుకుని ప్రళయాగ్నిలా మండిపడుతూ "మొండికీనుగా! ఇదంతా నువ్వు చేశా" వని ముసలావిడమీద యెగిరిపడ్డాడు. ఆయౌద్ధత్యం చూసి మూడోవా "డేమి" టని అడగ్గా యాజులు "వెంకిగాడు సోమిక్కూడా నెసవపెళ్లి తగలేశాడు" అని రుంజుకుంటూ చతికిలపడ్డాడు. ఈవార్త వినడంకోసమే యెదురు చూస్తూ వున్న ముసలావిడ "ఇంకా గింజుకోండి" అంటూ మెల్లిగా యింటోకి వెళ్లిపోయింది.

---

# న వ క వి

చలమయ్య, ప్రసాదరావు గార్లు (నవకవిమండలి)

జీర్ణించెన్ గవిరాజవీథి రజనీశృంగారలాస్యంబు ప్రా
గర్ణోరాశి మథించి భాస్కరుని దివ్యజ్యోతి భాగీరథీ
స్వర్ణాంభోజ సుధాస్రవంతికలపై వ్యాపించె, నంతంత నా
కర్ణింపంబడుచుండె షట్పదవధూకళ్యాణకంఠధ్వనుల్!

క. నవరస రసికాగ్రణులై - వివిధాగమ ధర్మశాస్త్ర విద్యాధరులై
కవికుల చూడామణులు భ - గవతీ పదపద్మపూజ గావించునెడన్.

చ. కపురపుఁ గమ్మతావు లొలుకన్ కలకంఠముఁబోలె నవ్యభా
వపులకితోర్ధ్వగీతములు పాడుచు వంగపురంధ్రి, దేవి మం
టప సముఖంబుఁ జేరె, కవి తల్లజు లానఖవీక్షణ ప్రభా
స్నపిత పవిత్ర గాత్రులయి సమ్మదబాష్పకణంబు రాల్పఁగన్.

క. పూర్ణ కళానిధి యావర - వర్ణిని ప్రణయప్రసన్న భావ పదంబుల్
కర్ణోత్పలమాలికలై స్వర్ణదిసంగీతభంగి పాళిక లయ్యెన్.

చ. ముకుళితపాణినై భువనమోహనమూర్తికి నంజలించి అం
బిక! నను మోహరించి వలపించుచునున్నది యుష్మదీయ వ